క్లుప్తంగా

ఎంపీ వద్దిరాజుకు సన్మానం



రవిచంద్రను సత్కరిస్తున్న దోరేపల్లి శ్వేత

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యులుగా మరోసారి నియమితులైన వద్దిరాజు రవిచంద్రను కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత ఆదివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి స్వర మాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ కవి ఆచార్య ఆత్రేయ జయంతి, స్వర మాధురి కల్చరల్ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సినీ సంగీత విభావరి కార్యక్రమంలో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యంలు ఆలపించిన అలనాటి మధుర గీతాలను గాయకులు పాడి అలరించారు. ఆదిరాజు పురుషోత్తమరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గాయనీ గాయకులు తదితరులు ఉన్నారు.

'బీజేపీని ఓడించాలి'

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజాస్వామ్య విలువలను పతనం చేసిన బీజేపీని ఓడించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్ కోరారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా విజయ్, కార్యదర్శి ఎల్లం దేవరాయ్, సురేష్, శ్రీను, ఝాన్సీ వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి: మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకు ఓటేయాలని కోరారు. నేడు కొత్తలింగాల క్రాస్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన జరిగే బహిరంగ సభకు మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఏపూరి మహేందర్, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, షేక్ ఫత్తేమహ్మద్, జర్పల లక్ష్మణ్‌నాయక్, బానోత్ నర్సింహనాయక్, దమ్మలపాటి సత్యనారాయణ, బాషింగ్, సుందరం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బాహూ
వినోద	టిల్లు²
సాయిరాం	ప్రసన్నవదనం
ఆదిత్య	శబరి
శ్రీనివాస	ఆ.. ఒక్కటీ అడక్కు

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	2
పచ్చిమిర్చి	50		10
కాకర	40	చుక్కకూర	2
బీర	54		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	86	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	35		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	48		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం



వేణుగోపాల్ నగర్‌లో కాల్వకట్టపై నీరు లేక ఎండిపోతున్న మొక్కలు



ఎన్ఎస్‌పీ క్యాంపులోని ఫ్రీడమ్ పార్కులో..



ఎన్ఎస్‌పీ క్యాంపులో రోడ్డు వెంట..

మొక్కలకూ నీటి కరువు..!

పార్కుల్లో, రోడ్ల వెంట ఎండుతున్న వైనం

- పట్టించుకోని నగర పాలకసంస్థ అధికారులు
- నీరు పట్టి సంరక్షించాలని కోరుతున్న స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: నీరు లేక మొక్కలు ఎండుతున్నాయి. భగ్గుమనే ఎండలతో వడబడుతున్నాయి. మొక్కలను సంరక్షించేందుకు ప్రతీరోజు నీరు పెట్టడం అవసరం అయితే పలు ప్రాంతాల్లో ఉన్న ఈ మొక్కలను పట్టించుకోవడం లేదు. ప్రధానంగా పార్కుల్లో ఉన్న మొక్కలపై కూడా దృష్టి సారించడం లేదు. నగర పాలక సంస్థ అధికారులు ఈ విషయాలేమీ పట్టించుకోవడం లేదు. మొక్కలు ఎలా ఉన్నాయి..? రోజూ నీరు పడుతున్నారా..? లేదా అన్న విషయాలపై దృష్టి సారించడం లేదు. దీంతో అట్టహాసంగా నాటిన మొక్కలు నిష్కారణంగా ఎండిపోతున్నాయి. మొక్కలకు నీరు పెట్టాలని స్థానికులు కూడా కోరుతున్నారు.

పట్టించే లేదు..

నగరంలోని పలు డివిజన్లలో కాల్వకట్టలపై వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసి వాటికి ఇరువైపుల, రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో పట్టణ పార్కులు, ఫ్రీడమ్ పార్కులు ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. కొన్ని పార్కుల్లో మొక్కలకు నీళ్లు పెడుతున్నా.. చాలా పార్కుల్లో నీటిని పెట్టే వారు లేరు. ఇక కాల్వకట్టలపై ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ల ఇరువైపుల మొక్కలకు నీళ్లు పోసే వారే కరువయ్యారు. పూలమొక్కలు, పండ్ల మొక్కలు నాటించిన అధికారులు ఈ వేసవిలో వాటి సంరక్షణను మరిచారన్న విమర్శలు ఉన్నాయి. పార్కుల్లో బోర్లు, మోటార్లు ఉన్నా నీళ్లు పెట్టకపోవడంపై సిబ్బంది మీద స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేఎంసీ అధికారులను వివరణ కోరగా.. మొక్కలకు నీరు పెట్టేలా సిబ్బందికి సూచనలు చేశామని, ప్రతీ రోజు మొక్కలకు నీరు పెట్టాలని పార్కుల్లో గార్డెనర్స్‌కు సూచించామని, మొక్కలు ఎండిపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహోన్నత సిద్ధాంతకర్త మార్క్స్



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ గతిని మార్చిన మహోన్నత సిద్ధాంత కర్త కారల్‌మార్క్స్ అని, ఆయన సిద్ధాంతం అసమానం అజరామరమని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మార్క్స్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... పాలకులు ఎప్పుడూ పెట్టుబడిదారుల వైపు నిలుస్తారని, శ్రమజీవులు పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని చెప్పి ప్రపంచ వ్యాపితంగా శ్రమజీవులను కార్యోన్ముకులను చేసిన చైతన్యశీలి మార్క్స్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు పోటు కళావతి, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మీనారాయణ, తాటి నిర్మల, పగిడిపల్లి ఏసు, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

8న తలసేమియా దినోత్సవం



మ్యూజికల్ చైర్ ఆడుతున్న చిన్నారులు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రపంచ తలసేమియా దినోత్సవం ఈ నెల 8న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు సంస్థ కోశాధికారి పి.రవిచంద్ర తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డేకేర్ సెంటర్‌లో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఏడాదిలా నెల రోజుల కార్యక్రమాలు చేపట్టామని, చిన్నారులకు అవసరమైన రక్తం కోసం రక్తదాన శిబిరాలు, వ్యాధిని అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు, ఉచిత మందుల పంపిణీ నిర్వహించామన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా బుధవారం జరిగే కార్యక్రమంలో చిన్నారులకు బహుమతులు అందజేస్తామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 8 మంది చిన్నారులకు బోన్‌మ్యారో చికిత్స చేయించి విజయం సాధించామన్నారు. ఈ సందర్భంగా డేకేర్ సెంటర్‌లో చిన్నారులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించామన్నారు. వైద్యులు డి.నారాయణమూర్తి, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, సభ్యులు పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ కృషి మరువలేనిది



మాట్లాడుతున్న సుదర్శన్

ఖమ్మంమామిళ్లగూడెం: మోదీని మూడోసారి ప్రధానిగా చూడాలని దళితులు ఆశపడుతున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోటమర్తి సుదర్శన్ అన్నారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో కరోనా సమయంలో దేశ ప్రజలను కాపాడుకునేందుకు మోదీచేసిన కృషి మరువలేనిదన్నారు. ఖమ్మం బీజేపీ ఎంపి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు రీగన్ ప్రతాప్, శ్రీనివాసరావు, దాసరి ప్రసాద్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం..

దేశ అభివృద్ధి మోదీతోనే సాధ్యమని బీజేపీ నాయకులు గొంగూర వెంకటేశ్వర్లు, రుద్రప్రదీప్ అన్నారు. బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కోరుతూ 9వ డివిజన్‌లో ఆదివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మోతుకూరి నారాయణరావు, దొంగల సత్యనారాయణ, శ్రీనివాస్, అల్లిక అంజయ్య, శ్రీదేవిరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

గాలివాన బీభత్సం



రఘునాథపాలెం: కొర్లబోడుతండాలో పిడుగుపడి చీలిన చెట్టు



నేలకొండపల్లి: కిందపడి పగిలిన ఇంటి రేకులు

ఖమ్మంఅర్బన్/ రఘునాథపాలెం/ కామేపల్లి/ నేలకొండపల్లి: అప్పటి వరకు భగభగలాడిన ఎండ తీవ్ర నిమిషాల్లో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోని ఆదివారం సాయంత్రం గాలివాన బీబత్సం సృష్టించింది. భారీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడి ఒక్కసారి వాతావరణం చల్లబడింది. రఘునాథపాలెం మండలంలోని కొర్లబోడు తండా సమీపంలో వ్యవసాయ భూమిలో వేపచెట్టుపై, నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండాలో బాణోత్ బొజ్జ పొలంలో కొబ్బరి చెట్టుపై పిడుగులు పడ్డాయి. పలు గ్రామాల్లో గాలితో కూడిన రాళ్లవర్షం పడింది. గాలివానతో పలు చోట్ల మామిడితోటలో మామిడి కాయలు నేలరాలాయి. వానతగ్గిన తర్వాత విద్యుత్ అధికారులు ఒకోకటి సమస్యలను పరిష్కరించుకుంటూ సరఫరా పునరుద్ధరించినట్లు అర్బన్ ఏఈ అశోక్ తెలిపారు.

డీప్‌ఫేక్ ఆడియోలతో పెనుముప్పు

ఖమ్మంమయూరిసెంటర్: డీప్‌ఫేక్ ఆడియోలు సమాజానికి పెను ముప్పుగా మారుతున్నాయని ఇవి సమాజంలో గందరగోళానికి కారణమవుతున్నాయి అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కొంత కాలంగా తన పైన అసత్య ప్రచారం చేస్తున్నారని, గత ఎన్నికల తరుణంలో కూడా ఇదే మాదిరిగా.. ఇప్పుడు కూడా కొందరు ఆగంతకులు తను మాట్లాడినట్టుగా ఓ డీప్‌ఫేక్ ఆడియోను సృష్టించారని పేర్కొన్నారు. ఈ విధమైన జరుగుతున్న దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కమ్మ సంఘానికి రాజీనామా చేయాలి

ఖమ్మం లీగల్: ఖమ్మం మహాజన సంఘం అధ్యక్షుడిగా కాకుండా ఓ రాజకీయ పార్టీ ప్రతినిధిలా వ్యవహరిస్తున్న ఎర్నేని రామారావు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కమ్మ సంఘం మాజీ డైరెక్టర్, గొల్లపూడి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎర్నేని రామారావుతో పాటు ప్రధాన కార్యదర్శికి లీగల్ నోటీసులు జారీ చేశారు. సంఘాన్ని ఒక రాజకీయ పార్టీకి తాకట్టు పెట్టే విధంగా వ్యవహరించడం, ఒక పార్టీకి మద్దతు ప్రకటించడం సంఘం నిబంధనకు వ్యతిరేకమన్నారు. వెంటనే ఆ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే అధ్యక్ష పదవికి ఆయన వెంటనే రాజీనామా చేయాలని పేర్కొన్నారు.

నామను గెలిపించాలని ప్రచారం..



ప్రచారం చేస్తున్న నామ తనయుడు భవ్యతేజ, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావును గెలిపించాలని ఆయన తనయుడు భవ్యతేజ, మనోజ్ఞ దంపతులు కోరారు. ఆదివారం ఖమ్మం నగరంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి నామను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానస్, రమాదేవి, పగడాల రవి తదితరులు పాల్గొన్నారు.

జాతి ప్రయోజనాలు తాకట్టు..

ఖమ్మం మామిళ్లగూడెం: జాతి ప్రయోజనాలను తాకట్టు పెట్టడం సరైందికాదు అని తెలంగాణ మాదిగ మహాకూటమి జిల్లా చైర్మన్ మట్టె గురుమూర్తి అన్నారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మందా కృష్ణమాదిగ జాతి ప్రయోజనాలను తాకట్టు పెట్టిన ఫలితంగా మాదిగ జాతికి తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సంజీవరావు, శేఖర్ కుమార్, లింగం, ప్రసాద్, చిరంజీవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా..

- కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి



రఘురాంరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఆటో కార్మికులందరికీ ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామని కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఐఎన్‌టీయూసీ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో హాజరై ప్రసంగించారు. రాయితీలు అందేలా చూస్తామని, సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామన్నారు. అందరూ తమ గ్రామాల్లో కాంగ్రెస్ తరపున విస్తృత ప్రచారం చేయాలని, భారీ మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా నగరంలోని ఎన్ఎస్‌టీ రోడ్డు శ్రీదేవి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళంలో ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డాక్టర్ బొల్లికొండ శ్రీదేవి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్, సీనియర్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, మాజీ కార్పొరేటర్ దీపక్ చౌదరి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, నగర అధ్యక్షులు నరాల నరేష్.

మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో..

నగరంలోని ఖిల్లా బాగ్‌లో మైనారిటీ మహిళా ఆత్మీయ సమ్మేళనం జిల్లా మైనారిటీ నాయకులు షేక్ జిలానీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ షౌకత్ అలీ, ఆశిత, రామసహాయం అర్జున్ రెడ్డి, కార్పొరేటర్ షౌకత్ ఆలియా, గౌస్, ముక్రమ్, అఫ్సర్, గఫూర్, సలీం పాల్గొన్నారు.

కరుణగిరి చర్చిలో ప్రార్థనలు..

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి చర్చిలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం. రఘురాంరెడ్డి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం పార్లమెంట్ అభివృద్ధి జరగాలంటే తనకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రాంబాబు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో రుణం తీర్చుకుంటా..

- బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రైతు బిడ్డ అయిన తనని ఎంపీగా మరోసారి గెలిపిస్తే మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బలపాల గ్రామస్తుల ఆత్మీయ సమ్మేళనంలో నామ పాల్గొని మాట్లాడారు. తాను అందరివాడినని, అందరికి సేవ చేసే ఆలోచన కలిగిన వ్యక్తిని తాను అన్నారు. బలపాల రైతు బిడ్డగా 25 ఏళ్ల తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాత మధుసూదన్, జి.వీరభద్రం, బాగం కోటేశ్వరరావు, నామ సైపులు, దేవరపల్లి ఏకాంబరావు, ముండ్ల రమేష్, నెల్లూరి చంద్రయ్య పాల్గొన్నారు. అదేవిధంగా నామ నాగేశ్వరరావును గెలిపించాలని ఆయన తనయుడు పృథ్వీ తేజ ప్రచారం నిర్వహించారు.

వాకర్స్‌ను కలిసి..

నగరంలోని రాపర్తినగర్ బీసీ కాలనీలోని మైదానంలో వాకర్స్‌ను నామ నాగేశ్వరరావు కలిశారు. వారితో ముచ్చటించి, కలిసి నడిచారు. ఈ ఎన్నికల్లో మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత, నాయకులు ఉన్నారు.

పెరుగుతున్న మోదీ చరిష్మా..

- బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు..



మాట్లాడుతున్న వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: రోజురోజుకు ప్రధానిమోదీ చెరిష్మా ప్రజల్లో పెరుగుతుందని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మంలో శ్రీశ్రీ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణరాథోడ్, మోహన్, రవిరాథోడ్ ఆధ్వర్యంలో కారేపల్లి మండలం నుంచి ఐదుగురు ఎంపీటీసీలు, 20 మంది మాజీ సర్పంచ్‌లు, 50 మంది వార్డు మెంబర్లు అలాగే రఘునాథపాలెం నుండి వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా తాండ్రతో పాటు, మాజీ మంత్రి విజయ రామారావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో 400 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, అయోధ్య రామమందిర నిర్మాణం 500 ఏళ్ల కల నెరవేరిందన్నారు. ఖమ్మంలో అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారని, ఈసారి తనకు ఇవ్వాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్ , అల్లిక అంజయ్య, చావా కిరణ్ పాల్గొన్నారు.

అదేవిధంగా పట్టణంలోని వాసవి గార్డెన్స్ లో నిర్వహించిన ఆర్య వైశ్య సమ్మేళనంలో ధర్మరక్ష ఫౌండర్ చైర్మన్ శ్రీ చికోటి ప్రవీణ్, ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, రాష్ట్ర ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు ఉప్పల శారద, జిల్లా ఆర్య వైశ్య విభాగం అధ్యక్షుడు వనమా వేణుగోపాల్ హాజరై మాట్లాడారు.. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.

అత్యధిక మెజార్టీ అందించాలి



నేలకొండపల్లి: ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



ఖమ్మంవన్‌టౌన్: వస్త్ర దుకాణంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: బీఆర్ఎస్, బీజేపీలకు లోక్‌సభ ఎన్నికలలో దిమ్మతిరిగే మెజార్టీని కాంగ్రెస్ అందించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం పర్యటించారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించారు. ముజ్జుగూడెం, అనాసాగారం, పైనంపల్లి తదితర గ్రామాలలో ప్రసాద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా అహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు శాఖమూరి రమేష్, భద్రయ్య, అడపాల రామారావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బొందయ్య, కుక్కల హనుమంతరావు, వంగవీటి నాగేశ్వరరావు, కడియాల నరేష్, ఉండమోదుగుల శ్రీనివాసరావు, వడ్డె జగన్ పాల్గొన్నారు.

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ కోరారు. ఆదివారం నగరంలో ప్రముఖ వస్త్ర దుకాణం జీవి మాల్లో రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సీపీఎం నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ సీపీఎం కోఆర్డినేటర్ యర్రా శ్రీకాంత్, సెక్రటరీ లు విక్రమ్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కామేపల్లి: స్థానిక కామేపల్లి హైస్కూల్ పదోతరగతి 2006–07 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి స్నేహితులంతా ఒక చోట కలుసుకుని జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకుని ఆటపాటలతో సందడిగా గడిపారు. అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శ్రీనివాసరావు, గోపాలరావు, లక్ష్మీనారాయణ, సుధాకర్, శ్రీను, కొండలరావు, సావిత్రిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శైలా, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.